

26న ఉచిత మెగా మెడికల్ క్యాంప్

భీమవరం రూరల్: ఈనెల 26(ఆదివారం) ఉదయం 8 గంటల నుంచి బిపి, షుగరు, ఫిట్సు, ఫెరాలసిస్, ఇతర వ్యాధులకు ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మెడికల్ టీం కన్వీనర్, వసుధ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. మంగళవారం సుందరయ్య భవనంలో అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు, మెడికల్ టీం సమావేశం జరిగింది. అనంతరం స్థానిక సిపిఎం కార్యాలయంలో కరపత్రం విడుదల చేశారు. ఈ క్యాంపునందు ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ గోపాళం శివన్నారయణ(విజయవాడ), డాక్టర్ సందీప్‌వర్మ(మన హాస్పటల్) డాక్టర్ జి.పద్మజ, డాక్టర్ పి.సత్యనారాయణ రాజు పాల్గొని రోగులను చూస్తారని తెలియజేశారు. 3 నెలలకు సరిపడా మందులు రూ.300లకే బిపి, షుగరు, పెరాలసిస్ పేషెంట్లకు ఇస్తారని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే ఈ మెడికల్ క్యాంప్‌ని వినియోగించుకోవాలన్నారు. ప్రతిరోజు సుందరయ్య భవనంలో ఉచిత ఆసుపత్రి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మెడికల్ క్యాంప్ టీం చైతన్య ప్రసాద్ పాల్గొన్నారు.

కౌలు కార్డులు ఇచ్చేదెప్పుడు..!



- నేటికీ ప్రారంభం కాని ప్రక్రియ
- ప్రతియేటా ఏప్రిల్ నుంచే గ్రామసభలతో ముందుకు
- రెండు జిల్లాల్లో దాదాపు 3 లక్షల మంది కౌలురైతులు
- గతేడాది లక్షా 40 వేల మందికే కార్డులు జారీ
- పంట రుణాల మంజూరు అంతంత మాత్రమే
- ఈ ఏడాదైనా కౌలురైతులకు న్యాయం జరిగేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ కొద్దిరోజుల్లో ప్రారంభం కానుంది. రైతులు విత్తనాల కొనుగోలు వంటి ప్రక్రియను చేపట్టారు. కౌలు ఒప్పందాలు సైతం దాదాపు పూర్తయ్యాయి. కౌలురైతుల గురించి మాత్రం ప్రభుత్వం మరిచిపోయినట్లు కన్పిస్తోంది. ఇప్పటికీ కౌలుకార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించకపోవడం అందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. ఖరీఫ్‌లో నాలుగు లక్షల ఎకరాలకుపైగా వరిసాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా కౌలురైతులే సాగు చేస్తున్నారు. వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతుల పట్ల ప్రతియేటా ప్రభుత్వం చిన్నచూపే చూస్తోంది. వైసిపి ప్రభుత్వం వచ్చాక కౌలురైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. కౌలుదారులకు సంబంధించిన '2011 భూ అధీకృత సాగుదారుని చట్టం'ను వైసిపి సర్కార్ మార్చేసింది. 2011 చట్టంలో భూయజమానితో సంబంధం లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి భూములు కౌలుకు చేస్తున్న రైతులను గుర్తించి కౌలుకార్డులు జారీ చేయాలనే నిబంధన ఉంది. వైసిపి ప్రభుత్వం తెచ్చిన 2019 పంట సాగుదారుని హక్కు చట్టంలో భూయజమాని అంగీకారంతోనే కౌలుకార్డులు జారీ చేయాలని కొత్త నిబంధన తెచ్చింది. కౌలుదారులకు రుణార్హత కార్డులు ఇచ్చేందుకు భూయజమానులు అంగీకరించడం లేదు. దీంతో గడిచిన ఐదేళ్లుగా కౌలురైతుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలురైతులు ఉండగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలో 57 వేల కౌలుకార్డులు, పశ్చిమగోదావరిలో 85 వేల మందికి మాత్రమే కౌలుకార్డులు జారీ చేసిన పరిస్థితి ఉంది. దీంతో దాదాపు మరో లక్షా 50 వేల మందికిపైగా కౌలురైతులకు కౌలుకార్డులు అందనే లేదు. దీంతో కౌలురైతులకు బ్యాంకుల నుంచి పంటరుణాలుగాని, దెబ్బతిన్న పంటలకు సంబంధించి పరిహారం, బీమా వంటివి సైతం అందని పరిస్థితి ఏర్పడింది. కార్డులు ఇచ్చిన రైతులకు కూడా అరకొర రుణాలు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారు. కౌలుకార్డులు లేకపోవడంతో పండించిన పంటను సైతం భూయజమాని పేరుపైనే అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో గడిచిన ఐదేళ్లుగా కౌలురైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

నేటికీ ప్రారంభం కాని ప్రక్రియ..

కౌలుకార్డుల జారీకి సంబంధించిన ప్రక్రియ ఏప్రిల్ మూడోవారం నుంచే అధికారులు ప్రారంభించేవారు. గ్రామసభలు ఏర్పాటు చేసి కౌలురైతులను గుర్తించేవారు. భూయజమానులకు అవగాహన కల్పించే ప్రక్రియ చేపట్టేవారు. ఈ ఏడాది ఎన్నికలు రావడంతో ఇప్పటి వరకూ కౌలుకార్డులకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభం కాలేదు. జూన్ రెండోవారం నుంచి ఖరీఫ్ నారుమడులు ప్రారంభమయ్యే పరిస్థితి ఉంది. సాగుచేసే రైతులకు కౌలుకార్డులు జారీచేసి బ్యాంకులు రుణాలు అందిస్తేనే కౌలురైతులకు మేలు జరుగుతుంది. లేకపోతే ప్రయివేటు వడ్డీవ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. గతంలో జారీ చేసిన కౌలుకార్డులను రెన్యువల్ చేయడంతోపాటు, కొత్త కార్డుల జారీ ప్రక్రియ చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉంది. అంతేకాకుండా భూయజమానితో సంబంధం లేకుండా వాస్తవ సాగుదారులకు కౌలుకార్డులు జారీ చేయాలి. ఎన్నికల నేపథ్యంలో కౌలురైతులను పూర్తిగా గాలికి వదిలేస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. అదే జరిగితే ఈ ఏడాది కౌలురైతులకు అన్యాయం చేసినట్టే అవుతోంది.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

నిరంతర నిఘాలో స్ట్రాంగ్‌రూములు

ఎస్‌పి మేరీ ప్రశాంతితో కలిసి పరిశీలించిన కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఇవిఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద నిరంతర బందోబస్తుతో పర్యవేక్షించామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఇవిఎంలు భద్రపర్చిన వట్లూరులోని సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్‌రూమ్‌లను మంగళవారం జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతితో కలిసి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవిఎంల భద్రతపై అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇవిఎంలకు కేంద్ర, రాష్ట్ర సివిల్ పోలీసులతో మూడంచెల భద్రత కల్పించామన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లకు ఉన్న తలుపులకు వేసిన తాళాలను వాటికున్న సీళ్లను, అన్నిచోట్లా సీసీ కెమెరాల పనితీరును వారు క్షుణంగా పరిశీలించారు. మూడంచెలు గల కేంద్ర పోలీసు బలగాల గార్డును, జిల్లా ఆర్మడ్, సివిల్ పోలీస్ బందోబస్తును వారు పరిశీలించారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్‌రూమ్‌లు ఉన్న ప్రాంతంలోకి ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించరాదన్నారు. స్ట్రాంగ్‌రూమ్ ప్రాంగణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాన్ని నో ఫ్లయ్‌జోన్‌గా ప్రకటించామన్నారు. జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజు వరకూ స్ట్రాంగ్‌రూమ్‌లకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. సమన్వయ లోపం రానీయకుండా ప్రత్యేక పోలీస్ అధికారులు స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతను పర్యవేక్షిస్తున్నారన్నారు. వీరివెంట కైకలూరు, ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు కె.భాస్కర్, ఎం.ముక్కంటి, పలువురు పోలీస్ అధికారులు ఉన్నారు.

5వ తేదీ వరకూ డ్రోన్లతో చిత్రీకరణ నిషేధం

ఇవిఎంలు భద్రపర్చిన ఏలూరు జిల్లా పెదపాడు మండలం వట్లూరులోని సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో డ్రోన్లతో వీడియో, ఫొటోలు చిత్రీకరణను నిషేధిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇవిఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ పరిధిలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. వట్లూరులోని సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలోని ప్రాంతాన్ని ఈ నెల 20వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు నో ఫ్లయ్ జోన్‌గా ప్రకటించినట్లు తెలిపారు. ఈ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అదే విధంగా పోలింగ్‌కు వినియోగించిన ఇవిఎంలు, వివిప్యాట్‌లు భద్రపర్చిన వట్లూరులోని సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణం, చుట్టుపక్కల ఎటువంటి డ్రోన్లు ఎగరకుండా అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పిని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.


బాణాసంచా వినియోగంపై తాత్కాలిక నిషేధాజ్ఞలు

సార్వత్రిక ఎన్నికల ఫలితాల కౌంటింగ్, గెలుపొందిన అభ్యర్థులు వారికి మద్దతుగా విజయోత్సవాలు నిర్వహించే క్రమంలో బాణాసంచా కాల్చడం వాటి వల్ల తలెత్తే వివిధ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్‌పి నివేదిక మేరకు ఏలూరు జిల్లావ్యాప్తంగా బాణాసంచా తయారీ, రవాణా, విక్రయాలపై జూన్ 5వ తేదీవరకు తాత్కాలిక నిషేధం విధిస్తూ జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని నిషేధాజ్ఞలను విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నిషేధాజ్ఞలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలయ్యేలా బాణాసంచా కాల్చడం, తయారీ, రవాణాలను నిలుపుచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒలను, తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు.

ఎన్ఆర్ఐ అసోసియేట్ ప్రొఫెసర్ హరితకు పిహెచ్‌డి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని ఎన్ఆర్ఐ కళాశాలలో మెకానికల్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న తమ్మారెడ్డి హరితకు ఆంధ్రా యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రదానం చేసింది. ఆంధ్రా యూనివర్సిటీ మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ కె.రామ్‌జీ ఆధ్వర్యంలో మైక్రోవేవ్ ఎబ్జార్షన్ అండ్ స్ట్రక్చరల్ బిహేవియర్ ఆఫ్ పిసిఎన్‌టి/ఎంజడ్ఎఫ్ బేస్డు పాలిమర్ రాడార్ అబ్జార్బింగ్ స్ట్రక్చర్స్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు హరితకు పిహెచ్‌డి లభించింది. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ జి.సాంబశివరావు ఆమెను అభినందించారు.



హరితకు పిహెచ్‌డి పట్టా అందజేస్తున్న ఛైర్మన్ వెంకట్రావు



గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమం నిర్వహిస్తున్న రిసోర్స్ పర్సన్

మాతృభాషతోపాటు ఇంగ్లీష్‌ను కూడా నేర్చుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

మారిన విద్యా విధానానికి అనుగుణంగా విద్యార్థులు మాతృభాషతోపాటు ఇంగ్లీష్‌ను కూడా నేర్చుకోవాలని, మానవత సంస్థ కెరీర్ గైడెన్స్ జిల్లా డైరెక్టర్ టివి.ఉమామహేశ్వరరావు కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆంగ్ల భాష పరిచయం, నేర్చుకునే విధానం గురించి వివరించారు. రిసోర్స్‌పర్సన్ ఉమామహేశ్వరరావు విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్, సులువుగా అర్థం చేసుకోవడం, రాయటం వంటి అంశాల గురించి వివరించారు. లెక్కలు సులువుగా చేయడానికి చిట్కాలు, సారాంశాలను వివరించారు.

మాజీ ఎంఎల్‌ఎ పెండ్యాల కృష్ణబాబు మృతి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విషాదఛాయలు

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

ప్రముఖ రాజకీయవేత్త, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు మాజీ ఎంఎల్‌ఎ పెండ్యాల కృష్ణబాబు (71) మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. కొద్దిరోజులుగా ఆయన అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. 1983 నుంచి 94 వరకూ వరుసగా నాలుగుసార్లు కొవ్వూరు నుంచి టిడిపి ఎంఎల్‌ఎగా కృష్ణబాబు ఘన విజయం సాధించారు. 1999లో ఓటమి చెంది, 2004లో ఐదోసారి కొవ్వూరు ఎంఎల్‌ఎగా గెలిచి కృష్ణబాబు రికార్డు సృష్టించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితుడు కావడంతో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పెట్టిన వైసిపిలో కొన్నేళ్ల క్రితం చేరారు. 2009లో కొవ్వూరు నియోజకవర్గం ఎస్‌సి రిజర్వు కావడంతో ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న కృష్ణబాబు 2019 ఎన్నికల్లో ప్రస్తుత మంత్రి తానేటి వనితకు కొవ్వూరు వైసిపి టికెట్ ఇప్పించడంతోపాటు ఆమె విజయానికి కృషి చేశారు. అంతేకాక రాష్ట్ర మంత్రివర్గంలో ఆమె నియామకానికి కృషి చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘకాలం కృష్ణబాబు చక్రం తిప్పారు. టిడిపిలో ఉండగా కొవ్వూరు నియోజకవర్గంతోపాటు పోలవరం, గోపాలపురం నియోజకవర్గాల్లో అభ్యర్థుల విజయానికి ఆయన వెన్నుదన్నుగా నిలిచారు. కృష్ణబాబు మరణ వార్త తెలిసిన వెంటనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా రాజకీయ నేతలు, ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆంధ్రా సుగర్స్‌తో పలు ఫ్యాక్టరీల నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి కృష్ణబాబు భౌతికకాయాన్ని ఆయన స్వగ్రామమైన కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి తీసుకొచ్చారు. బుధవారం ఆయన పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తారు. కృష్ణబాబు మతికి సంతాప సూచకంగా బుధవారం కొవ్వూరులో వ్యాపార సంస్థలను మూసివేస్తున్నట్లు సంబంధీకులు తెలిపారు.



కృష్ణబాబు (ఫైల్‌ఫొటో)

కొనసాగిన ఫుడ్‌ఫ్యాట్స్ కార్మికుల దీక్షలు

యాజమాన్యం వేతన ఒప్పందం వెంటనే చేయాలి - సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఫుడ్‌ఫ్యాట్స్ యాజమాన్యం కార్మికులకు వెంటనే వేతన ఒప్పందం చేయాలని కోరుతూ 3ఎఫ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు), సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ ప్రధాన గేటు వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం రెండోరోజు కొనసాగాయి. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ 3ఎఫ్ యాజమాన్యం మొండివైఖరి వీడాలని, వెంటనే వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం మార్చి నెలతోనే వేతన ఒప్పందం కాల పరిమితి పూర్తయినప్పటికీ 3ఎఫ్ యాజమాన్యం నూతన వేతన ఒప్పందానికి సిద్ధపడకపోవడం దుర్మార్గమన్నారు. గత వేతన ఒప్పందంలో 29.5 శాతం పెంపు ఉండగా, ప్రస్తుతం గతం కంటే ఎక్కువ వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై 3ఎఫ్ యాజమాన్యంతోనూ, ఏలూరు లేబర్ అధికారులతోనూ దఫదఫాలుగా చర్చలు జరిగాయని వివరించారు. 3ఎఫ్ యాజమాన్యం మొండివైఖరిపై లేబర్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వేతన ఒప్పందం చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఆందోళన, నిరసన, సమ్మె కార్యక్రమాలు నిర్వహించి యాజమాన్యానికి తగు బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, 3ఎఫ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.గణేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.



దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న రాజా రామ్మోహన్‌రాయ్

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - కలిదిండి

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. మండలంలోని పోతుమర్రు, చినతాడినాడ, సంతోషపురం గ్రామాల్లోని ఉపాధి పని ప్రదేశాల్లో ఆయన పర్యటించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై భారం వేయకుండా ప్రభుత్వమే మజ్జిగ, తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ సమస్యలపై పని చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘంలో సభ్యులుగా చేరి, ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల కమిటీ సభ్యులు అద్దాని వెంకటేశ్వరరావు, కె.లక్ష్మి, తిరుపతమ్మ, పడమటి సక్కుబాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి మహంకాళీరావు

కాలువల ఆధునికీకరణ ఏదీ?

- పేరుకుపోయిన తూడు
- నిధులు విడుదల కాని వైనం
- వ్యవసాయ, ఆక్వారంగాలపై ప్రభావం

ప్రజాశక్తి - భీమడోలు

కాలువలను కట్టేసిన సమయంలో ఏలూరు కాలువకు చేపట్టాల్సిన ఆధునికీకరణ పనుల జాడలేదు. అదే క్రమంలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఏర్పడిన తూడు తొలగింపునకు నిధులు విడుదల కాలేదు. త్వరలో కాలువలకు నీరు విడుదల చేయనున్న నేపథ్యంలో తూడు తొలగించని కారణంగా నీరు ముందుకు ప్రవహించే అవకాశం లేదు. దీని ప్రభావం తాగునీటితోపాటు వ్యవసాయ, ఆక్వారంగాలపై తీవ్రంగా పడే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. గుండుగొలను ఇరిగేషన్ కార్యాలయ పరిధిలోని నాలుగు మండలాల్లోని ఆగడాలలంక ఛానల్, గుండుగొలను డిస్ట్రిబ్యూషన్ కమిటీ, దెందులూరు డిస్ట్రిబ్యూషన్ కమిటీ, ఏలూరు మెయిన్ కాలువలో తూడు తొలగింపునకు అనుమతులు కోరుతూ ఇరిగేషన్ అధికారులు రూ.30 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలను అధికారులకు ఆలస్యంగా సమర్పించారు. ఎన్నికల నిబంధన సాకుతో ఈ నిధులు ఇంతవరకూ విడుదల కాలేదు. కార్యాలయ పరిధిలో సుమారు 20 వేల ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు జరుగుతోంది. కాలువ ద్వారా గుండుగొలను కార్యాలయ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన వివిధ గ్రామాలతో పాటు ఏలూరు కూడా తాగునీటి సరఫరా జరగాల్సి ఉంది. అయితే కాలువలు వదిలిన తర్వాత కాలువలో తూడు ఉన్న కారణంగా నీరు ముందుకెళ్లే అవకాశం లేక కాలువకు నీరు వదిలిన తొలిదశలోనే నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంది. ఇక అధికారులు తమకు కేటాయించిన నీటి తీరువా నిధులతో తాత్కాలికంగా కాలువకు మరమ్మతులు చేపడతామన్నా గత సంవత్సరం విడుదలకు కావాల్సిన రూ.30 లక్షలు ఇంతవరకూ విడుదల కాలేదు. ప్రస్తుత సంవత్సరం సైతం ఆ నిధులు విడుదల కాని కారణంగా పనులు జరగడం లేదు. ఏలూరు కాలువ ద్వారా గుండుగొలను ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో నీటి అవసరాలు తీరాలంటే కైకరం వద్ద ఆరున్నర అడుగులు, గుండుగొలను వద్ద ఐదున్నర అడుగులు, దెందులూరు వద్ద నాలుగున్నర అడుగులు, ఏలూరు కాలువ తూర్పు లాకుల వద్ద మూడున్నర అడుగుల నీటిమట్టం కొనసాగాల్సి ఉంది. అయితే తూడు తొలగింపునకు నిధులు విడుదల కాని నేపథ్యంలో తూడు తొలగింపు కార్యక్రమం సజావుగా జరిగే అవకాశం లేదని అధికారులు అంటున్నారు. దీనికి అదనంగా కాలువల్లో విపరీతంగా తూడుతో పాటు కర్రనాచు పెరిగిపోయింది. తూడు తొలగింపు సందర్భంగా తూడుతోపాటు కర్రనాచును కూడా కాలువలు కట్టేసిన సమయంలో తొలగించి కాలువ గట్లపై దూరంగా వేయాల్సి ఉంది. అయితే ప్రతి సంవత్సరం అధికారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టక, కాలువలు వదలిన తర్వాత తూడుపై రసాయనాలు చల్లి అవి కుళ్లిపోయిన తర్వాత దాన్ని ఏలూరు కాలువ పరిధిలోని ఏదో ఒక ఎస్కేప్ ద్వారా కొల్లేరులోకి మళ్లిస్తుంటారు. ప్రస్తుతం ఆ అవకాశం కూడా లేని కారణంగా నీరు సజావుగా ప్రవహించక తాగునీటికి సైతం ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు రైతులు అంటున్నారు. ఇంక కాలువలు వదలడానికి కొంత సమయం ఉన్నందున అత్యవసర ప్రాతిపదికన తూడు తొలగింపునకు నిధులు మంజూరు చేయడంతోపాటు ఆ పనులు కాలువల వదలడానికి ముందే చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ఏలూరు సమీపంలో కాలువపై అదనపు వంతెన నిర్మిస్తున్న నేపథ్యంలో అక్కడ ఏర్పాటు చేసిన అడ్డంకులు తొలగించి దాంతోపాటు ఆ ప్రాంతంలో పెరిగిపోయిన తూడు తొలగిస్తే తప్ప ఏలూరుకు తాగునీటి కష్టాలు తప్పే పరిస్థితి కనపడడం లేదు.



గుండుగొలను సమీపంలో జాతీయ రహదారి పక్కన ఏలూరు కాలువలో పేరుకుపోయిన తూడు, కర్రనాచు

ప్రజాశాంతికి భంగం కలిగిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి - ఏలూరు

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో వైఎస్ఆర్ కాలనీలో ఎవరైనా ప్రజాశాంతికి భంగం కలిగించేలా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ సిఐ రాజశేఖర్ అన్నారు. ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వైఎస్ఆర్ కాలనీలో మంగళవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.



తనిఖీలు నిర్వహిస్తున్న సిఐ రాజశేఖర్


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఇపిడిసిఎల్ ఉద్యోగులు

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు సర్కిల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం నిర్వహించడంపై జిల్లా అధికారులు ఎం.ముక్కంటి, ఎన్ఎస్.కృపావరం విద్యుత్ శాఖ అధికారులు సిబ్బందిని అభినందించారు. ఏలూరు వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్‌రాజుతో కలిసి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎన్.కృపావరం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మజ్జిగ చలివేంద్రం ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఇపిడిసిఎల్ ఉద్యోగులు ముందుకొచ్చి ప్రజలు ఎక్కువగా సంచరించే ఆర్ఆర్‌పేట వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మందికి దాహార్తిని తీర్చేందుకు దోహదపడుతోందన్నారు. ఈ సందర్భంగా మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసిన ఉద్యోగులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇపిడిసిఎల్ ఏలూరు సర్కిల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సిపిఐ నేత నాగేశ్వరరావు సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - కామవరపుకోట

సిపిఐ సీనియర్ నేత, ఎపి రైతు సంఘం నేత కొల్లి నాగేశ్వరరావు వర్ధంతి సభ కామవరపుకోట ప్రభు స్వామి సిమెంట్ వరాల కంపెనీ వద్ద మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ మండల కార్యదర్శి టివి ఎస్.రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగేశ్వరరావు ఉమ్మడి కృష్ణాజిల్లా గుడిపాడులో జన్మించి, ఉమ్మడి జిల్లా కృష్ణా జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా వివిధ హోదాల్లో పార్టీకి సేవలందించారని తెలిపారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడం కోసం కృష్ణ గోదావరి జిల్లాలను అనుసంధానం కోసం అహర్నిశలూ కృషి చేశారని తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్ జలదర్శిని' పుస్తకాన్ని రచించి ఆ పుస్తకాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్‌తో ఆవిష్కరించి, ప్రజలకు అంకితం చేసిన మహానేత నాగేశ్వరరావు అని కొనియాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి నేతలు నివాళు లర్పించారు. ఈ సభలో ఎఆర్‌పాలెం భూ పోరాట సమితి నాయకులు శెట్టి నాగ బాలాజీ, నల్లమోతుల శ్రీనివాసరావు, గదుల రామస్వామి పాల్గొన్నారు.


నాగేశ్వరరావుకు జోహార్లు అర్పిస్తున్న నేతలు


చికిత్స పొందుతున్న మహిళా కూలీ అన్నవరం

పాము కాటుతో మహిళా కూలీకి అస్వస్థత

ప్రజాశక్తి - పోలవరం

పాము కాటుతో మహిళా కూలీ అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం మండలంలోని ఎల్ఎన్‌డి పేట గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం హుకుంపేట గ్రామానికి చెందిన మొల్ల అన్నవరం నిత్యం ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం కొవ్వాడ గ్రామానికి పొగాకు కోత పనికి వస్తుంది. మంగళవారం ఉదయం కూడా పొగాకు చేలోకి పనికి వెళ్లగా పాము కాటు వేసింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను తోటి కూలీలు ఎల్ఎన్‌డి పేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు ఆమెకు ప్రథమ చికిత్స అందిస్తున్నారు.

నాటుసారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాటుసారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. టి.నరసాపురం పంచాయతీలోని గండిగూడెం గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారంతో మంగళవారం తన సిబ్బందితో దాడిచేసి మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఆమెను చింతలపూడి కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలీని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే ఎస్ఐ నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం. నగరంలోని జ్యూట్ మిల్లు రైల్వే వంతెన కింద గుర్తుతెలియని 35 నుండి 40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తిని రైలు ఢీకొంది. దీంతో ఆయన మృతి చెందాడు. అతను ఆకుపచ్చ రంగు టీ షర్టు, జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సరోజెన్ ఆస్పత్రిలోని మార్చ్యురీకి తరలించారు. ఈ ఘటనపై రైల్వే ఎస్ఐ డి.నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఏలూరు స్పోర్ట్స్: ఎటువంటి అనుమతులు లేకుండా శీతల పానీయాల సీసాలను తయారు చేస్తున్న వ్యక్తిపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండవల్లి మండలం లోకముడి గ్రామంలో కాగిత రామకృష్ణ అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా శీతల పానీయాల సీసాలను తయారు చేస్తున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సమాచారం అందుకున్నారు. ఈ మేరకు సీసాలు తయారు చేస్తున్న ఫ్యాక్టరీపై దాడి చేశారు. అక్కడ దాడి చేసిన సమయంలో కూల్ డ్రింకులను తయారుచేసే ఎసెన్సులకు అనుమతులు లేవని, అలాగే ఎక్స్పైర్ అయిపోయిన వాటిని వారు వినియోగిస్తున్నారని వారు గుర్తించారు. వెంటనే అతనిపై కేసు నమోదు చేసి ఫ్యాక్టరీని సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ సిఐ యుజె విల్సన్ ఫుడ్ సేఫ్టీ అధికారి రామరాజు, తూనికలు కొలతలు అధికారి ప్రశాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రోడ్లు, డ్రెయినేజీలు వద్దు.. గుక్కెడు నీళ్లివ్వండి..!

నీటి కోసం కిలో మీటరు వెళ్లాల్సిందే.. మల్లయ్యగూడెం, ఎసి అగ్రహారం గ్రామస్తుల ఆవేదన


బావిలో నీరు తెచ్చుకునేందుకు వెళ్తున్న మహిళలు

ప్రజాశక్తి - చింతలపూడి

మాకు రోడ్లు వద్దు.. డ్రెయినేజీలు వద్దు.. తాగడానికి గుక్కెడు నీళ్లివ్వండి మహాప్రభో అంటూ చింతలపూడి మండలం మల్లయ్యగూడెం, ఎసి అగ్రహారం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి తాగునీటి సమస్య ఉన్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

మండలం మల్లయ్యగూడెం ఎసి అగ్రహారం, ఆముదాలచిలక గ్రామస్తులు తాగడానికి నీరులేక నానా అవస్థలు పడుతున్నారు. ఉన్న నీరు కూడా ఉప్పగా ఉండడంతో వాడుకోవడానికి తప్ప తాగడానికి పనికిరాని పరిస్థితి నెలకొంది. దీంతో డబ్బులిచ్చి తాగునీరు కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎంతమంది నాయకులకు, అధికారులకు సమస్య చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయకులు ఓట్లు అడగడానికి వెళ్తే తమకు ఏమీ వద్దు తాగడానికి నీళ్లు కావాలని అడిగారంటే ఆయా గ్రామాల పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆముదాలచిలకకు చెందిన కొందరు గ్రామస్తులు డబ్బులు పెట్టి టిన్నులు కొనుగోలు చేయలేక రోజూ ఊరికి దూరంగా ఉన్న బావి నుంచి నీరు తీసుకెళ్తున్నారు. బావి దూరంగా ఉండడం, బావిలో నీరు కూడా పాతలానికి వెళ్లడంతో నీటిని తోడలేక మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

నీరు కావాలంటే కిలోమీటరు నడవాల్సిందే..

ఎసి అగ్రహారం మహిళలు రోజూ ఉదయం, సాయంత్రం తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. కిలో మీటరు వరకూ నడిచి బిందెలతో మోసుకొని వెళ్తున్నారు. ఆముదాలచిలక గ్రామస్తుల పరిస్థితి కూడా అంతే. ఒక్కోసారి పనులకు వెళ్లి రాత్రి 8, 9 గంటలైనా చీకటిలో తాగునీటి కోసం వెళ్లాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో 20 లీటర్ల వాటర్ టిన్ను రూ.5, తరువాత రూ.8, ప్రస్తుతం రూ.10 నుంచి రూ.15 తీసుకుంటున్నారు. అదే కూలింగ్ వాటర్ అయితే రూ.30 నుంచి రూ.40 వరకూ తీసుకుంటున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. రోజుకు రూ.200 కూలి ఇస్తారని, రూ.50 వరకూ తాగునీటి కోసం ఖర్చు చేస్తున్నామని తెలిపారు. వేసవిలో పనుల్లేక కరువు పనికి వెళ్తున్నామని రోజూ డబ్బులిచ్చి నీరు ఎలా తెచ్చుకోవాలని ప్రశ్నిస్తున్నారు.

మల్లయ్యగూడెం సర్పంచి చీకటి రమేష్ స్థలం ఇచ్చి షెడ్డు కట్టిస్తానని చెబుతున్నారని, బోర్ మోటార్, కరెంట్ కలెక్షన్ ఇస్తే వాటర్ ప్లాంట్ కట్టిస్తానని చెబుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో తమకు తమకు ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకోవాలని బోర్ వేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం..
కళ్యాణి, మల్లయ్యగూడెం

మాకు తాగునీరే ప్రధాన సమస్య. గుక్కెడు నీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. రోజూ డబ్బులిచ్చి నీటిని కొనుగోలు చేసే స్తోమత లేదు. ఎన్నిసార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. తాగునీటి సమస్యను పరిష్కరించండి. ఇక ఏమీ అడగం.

టిన్ను నీరు కొనే స్థోమత లేదు..
సావిత్రి, ఎసి అగ్రహారం

మేం కూలి పనులు చేసుకుని బతుకుతున్నాం. టిన్ను నీరు కొనే ఆర్థిక స్థోమత మాకు లేదు. నీరు లేక నానా ఇబ్బందులు పడుతున్నాం. పాలకులు ఓట్ల సమయంలో వస్తారే తప్ప తరువాత మమ్మల్ని పట్టించుకోరు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు మాకు తాగునీరందిస్తే అదే పదివేలు.

తాగునీరు ఇవ్వండి..
రావనమ్మ, ఆముదాలచిలక

నీరు లేక కిలోమీటరు వెళ్లి బావి నుంచి నీరు రోజు తెచ్చుకొని తాగుతున్నాం. ఉన్న నీరు ఉప్పగా ఉంటున్నాయి. అవి తాగడానికి పనికిరావడం లేదు. అధికారులు సమస్యను పట్టించుకోవాలి.

సమస్యను పరిష్కరిస్తాను..
రమేష్, సర్పంచి భర్త

స్థలం ఇచ్చి షెడ్ కట్టిస్తాను. బోర్ మోటార్, కరెంట్ కలెక్షన్ ఇస్తే వాటర్ ప్లాంట్ కట్టిస్తాను. గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరిస్తాను.

కొబ్బరి రైతులను ఆదుకోవాలి

కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొబ్బరికాయలకు కనీస ధరలు రాక రాష్ట్రంలోని కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కొబ్బరి రైతులకు పెట్టిన పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని ఎపి కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఏలూరు అన్నే భవనంలో కొబ్బరి రైతుల సమస్యలపై ఆయన మాట్లాడారు. వెయ్యి కొబ్బరికాయలకు రూ.8 వేలు మాత్రమే ధర వస్తోందన్నారు. వెయ్యి కాయలు కోసిగుట్టగా వేయడానికి రూ.3 వేలు ఖర్చువుతుందని చెప్పారు. పంట సాగుకు రైతు పెట్టిన పెట్టుబడి రావడం లేదన్నారు. తెగుళ్ల వల్ల దిగుబడులు బాగా తగ్గిపోయాయని తెలిపారు. రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు బాగా తగ్గాయన్నారు. విదేశీ కొబ్బరి ఉత్పత్తులు ఇబ్బడి ముబ్బడిగా దిగుమతులు కావడంతో దేశీయంగా మార్కెట్లో కొబ్బరికాయలకు ధర పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణంగా ఉన్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కొబ్బరి రైతులను ఆదుకోలేదన్నారు. రాష్ట్రంలో కొబ్బరి అత్యధికంగా సాగు చేసే కోనసీమ, ఉద్దానం, పశ్చిమగోదావరి, ఏలూరు, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ తదితర జిల్లాల్లోని కొబ్బరి రైతులు నష్టాలు పాలై ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వెంటనే నాఫెడ్ - ఆయిల్ ఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తెరవాలని డిమాండ్ చేశారు. రైతుకు వెయ్యి కొబ్బరికాయలకు గాను కనీస ధర రూ.15 వేలు ఇవ్వాలని, రైతుల నుంచి నేరుగా కొబ్బరికాయలనే సేకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మిల్లింగ్ కొబ్బరి క్వింటాల్‌కు రూ.11,160, బంతి కొబ్బరి క్వింటాల్‌కు రూ.12 వేలు రైతులకు ఏమాత్రమూ గిట్టుబాటు కాదని చెప్పారు. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.15 వేలకు పెంచాలని కోరారు. కొబ్బరి రైతులను ఆదుకోకపోతే ఆందోళనలకు కొబ్బరి రైతులంతా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

దేశాభివృద్ధికి రాజీవ్ గాంధీ కృషి ఎనలేనిది

ప్రజాశక్తి - ఏలూరు టౌన్


రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి ఏలూరు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి రాజనాల పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజనాల మాట్లాడుతూ దేశాభివృద్ధికి మొట్టమొదటిగా ఇంటర్నెట్ పరిచయం చేసిన మహనీయుడు రాజీవ గాంధీ అని కొనియాడారు. దేశం టెక్నాలజీ రంగంలో ఇంత అభివృద్ధి సాధించాడానికి రాజీవ్ కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు బ్లాక్ టు ప్రెసిడెంట్ లంకా రామ్మోహన్, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్య శర్మ, జిల్లా మీడియా కోఆర్డినేటర్ యోహాన్ రాజు, కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు కెఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

పోలవరం : రాజీవ్ గాంధీ వర్ధంతిని పోలవరంలో కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు ముచ్చిక సీత ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సీత మాట్లాడుతూ దేశ ప్రధానిగా నిజాయతీగా విధులు నిర్వహించి దేశం కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. కాంగ్రెస్ పాలనలోనే బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాయన్నారు. మరలా రాష్ట్రంలో కాంగ్రెస్ బలం పుంజుకుంటుందన్నారు.



ఏలూరుటౌన్ : రాహుల్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

భీమడోలు : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ శ్రేణులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యర్రంశెట్టి ఏడుకొండలు ఆధ్వర్యంలో మంగళవారం భీమడోలులో నిర్వహించారు. తొలుత గాంధీ బొమ్మ సెంటర్లో ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ దేశంలో ఐటి రంగ ప్రవేశానికి రాజీవ్ గాంధీ చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో పసల వెంకటరావు, ఐవి అచ్యుతం, ప్రముఖులు పాల్గొన్నారు.


భీమడోలులో..


పోలవరంలో..

కొనసాగిన ఎపిఇఎపి సెట్ పరీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికిగాను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎపిఇఎపి సెట్ ఆరో రోజు మంగళవారం ఇంజినీరింగ్ విభాగంలో స్థానిక వాసవి ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 249 మందికి గాను 243 మంది, సాయంత్రం నిర్వహించిన పరీక్షకు 249 మందికి 244 మంది మొత్తంగా 498 మందికి 487 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకర్‌రావు తెలిపారు. పరీక్షా కేంద్రం కోఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్ పర్యవేక్షించారు.


పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

మట్టి తవ్వకాలపై రెవెన్యూ ఉద్యోగులతో గస్తీ

ప్రజాశక్తి కథనంపై స్పందన

ప్రజాశక్తి - ఉంగుటూరు

అనుమతులు లేకుండా వరి చేలు, పొలం గట్లు, ఇరిగేషన్ భూముల్లో ఎలాంటి తవ్వకాలు జరగకుండా రెవెన్యూ ఉద్యోగులను కాపలా ఉంచామని తహశీల్దార్ కట్టా వెంకట శివయ్య తెలిపారు. చేబ్రోలు, తల్లాపురం, కైకరం తదితర ప్రాంతాల్లో వరి పొలాల్లో మట్టి అక్రమంగా తవ్వకం పేరిట మంగళవారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తల్లాపురం, కైకరంలో తవ్వకాలు జరిగిన పొలాలను పరిశీలించారు. గ్రామ రెవెన్యూ సహాయకులను రాత్రి కాపలా ఉంచి మట్టి తవ్వకం రవాణా జరగకుండా పకడ్బందీ నిఘా ఉంచాలని ఆదేశించామన్నారు. నిబంధనలు అతిక్రమించి తవ్వితే యంత్రాలను సీజ్ చేసి నిర్వాహకులపై కేసులు పెట్టాలని ఆర్ఐ సత్యనారాయణను ఆయన ఆదేశించారు.


మట్టి తవ్వకాలు జరిగిన పొలాలను పరిశీలిస్తున్న తహశీల్దార్

మండలంలో స్వచ్ఛభారత్ బృందం పర్యటన

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని ఏపిగుంట, కేతవరం గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛభారత్ బృందం మంగళవారం పర్యటించి మరుగుదొడ్లను పరిశీలించింది. ఈ సందర్భంగా పోలవరం ఎంపిడిఒ జి.శ్రీను మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలవరం, టి.నరసాపురం మండలాల విస్తరణాధికారులు ఇఎస్ శ్రీనివాసరావు, రాంప్రసాద్, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఎఇలు కె.గంగరాజు, బి.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు కృష్ణ శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మరుగుదొడ్లు పరిశీలిస్తున్న అధికారులు


మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మి

సంబరాలకు సిద్ధంగా ఉండండి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జూన్ నాలుగో తేదీన వైసిపి శ్రేణులంతా సంబరాలకు సిద్ధంగా ఉండాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారని, వైసిపి శ్రేణులంతా సంబరాల్లో మునిగితేలడం ఖాయమని తెలిపారు. ఎస్‌సి, బిసి, మైనార్టీ తదితరులంతా వైసిపికే ఓటు వేశారని తెలిపారు. ముఖ్యమంత్రిగా మరలా జగనే కొనసాగుతారని తెలిపారు. నాలుగో తేదీన అందరూ సిద్ధంగా ఉండాలన్నారు.

పైప్‌లైన్లకు మరమ్మతులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 20వ తేదీన నీరుగారుతున్న జల జీవన్ మిషన్ లక్ష్యం శీర్షికన ప్రజాశక్తి పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు మంగళవారం స్పందించారు. మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా వేసిన పైపులైన్ లీకవ్వడంతో నీరు కలుషితమై గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి మంగళవారం పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.


మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్

ప్రజాశక్తి - ముసునూరు

రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రమైన ముసునూరు వ్యవసాయ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న నేపథ్యంలో జీలుగు, జనుము, పిల్లి పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలోని 16 గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో రైతులు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని నమోదు చేయించుకుని విత్తనాలు తీసుకోవాలని తెలిపారు. జనుము, జీలుగు కేజీకి రూ.88 చెల్లించాలని, ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇవ్వడంతో కేజీకి రూ.44 మాత్రమే చెల్లించి తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా పిల్లి పెసర రూ.134 కాగా రూ.67 చెల్లించి తీసుకోవాలని తెలిపారు. 50 సెంట్ల రైతు నుంచి ఐదెకరాలలోపు ఉన్న ప్రతి రైతుకూ సబ్సిడీపై విత్తనాలు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు.